

ధాన్యంపై మిల్లర్ల అనాసక్తి



కలెక్టరేట్ వద్ద రైస్‌మిల్లర్లు

- ఒప్పందానికి మిల్లర్లు దూరం
- సీఎంఆర్‌కు గోనె సంచుల సమస్య
- సంచుల్లో కాప్రా పురుగు.. నిరాకరిస్తున్న ఎఫ్‌సీఐ
- నెలాఖరు వరకు సీఎంఆర్ గడువు పొడిగింపు
- జిల్లాలో ప్రారంభమైన కొనుగోలు కేంద్రాలు
- కలెక్టరేట్ వద్ద రైస్‌మిల్లర్ల నిరసన

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లాలో ఖరీఫ్ (వానాకాలం) ధాన్యం సేకరణ ప్రక్రియ మొదలైంది. పౌరసరఫరాలశాఖ కూడా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తోంది. రైస్‌మిల్లర్లు మాత్రం తమ సమస్యలు పరిష్కారమైన తర్వాతనే ధాన్యం దించుకుంటామని స్పష్టం చేస్తున్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు రాతపూర్వకంగా లేఖను అందజేశారు. ప్రభుత్వం తమ సమస్యల పరిష్కారానికి మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటు చేసిందని, సమస్య పరిష్కారమైన తర్వాతనే వానాకాలం సీజన్ ధాన్యం తీసుకుంటున్నామని, అప్పటివరకు ధాన్యం పంపించవద్దని కోరారు. జిల్లాలో ఇప్పటికే 248 కొనుగోలు కేంద్రాలకు 70కేంద్రాలు ప్రారంభించారు. రైతులు కేంద్రాలవద్ద ధాన్యం ఆరబోసుకుంటున్నారు. తూకం ప్రక్రియ ముందుకొస్తున్నా మిల్లర్లు, గోనె సంచులు, ధాన్యం దిగుబడికి సంబంధించిన ఒప్పందాలు పూర్తి కావడం లేదు. ప్రభుత్వం ఈసారి సన్నధాన్యంపై రూ.500 బోనస్ అందజేస్తామని ప్రకటించిన నేపథ్యంలో అందుకు సంబంధించిన విధి విధానాలు రాలేదు. మరో వైపు గతంలో మాదిరిగానే దొడ్డురకం ధాన్యానికి సంబంధించిన సీఎంఆర్ విధానంలో మార్పులు తీసుకురావాలని మిల్లర్లు కోరుతున్నారు.

సన్నధాన్యంలో నిబంధనలు మార్చాలి

సన్నధాన్యం మిల్లింగ్ నిబంధనల్లో మార్పులు తీసుకురావాలని జిల్లా మిల్లర్లు కోరుతున్నారు. ఇప్పటి వరకు అమలులో ఉన్న పాలసీ ప్రకారం బియ్యం ఇవ్వలేమని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం సన్నధాన్యం సీఎంఆర్‌కు ఇస్తే క్వింటాల్‌కు వానాకాలంలో పచ్చిబియ్యం 67 కిలోలు, యాసంగిలో బాయిల్డ్ రైస్ 68 కిలోల చొప్పున ప్రభుత్వానికి అందజేయాలి. ఇది తమకు తీవ్ర నష్టాన్ని కలగజేస్తుందని, వానాకాలం సీజన్‌కు సంబంధించి ప్రభుత్వరంగ సంస్థలు 17 శాతం తేమతో కొనుగోలు చేస్తాయని ఆ బియ్యాన్ని మిల్లింగ్ చేస్తే 57 శాతం లోపే పచ్చి బియ్యం వస్తాయని మిల్లర్లు పేర్కొంటున్నారు. 60శాతమే బియ్యమే ఇచ్చేలా నిబంధనలు మార్చాలని కోరుతున్నారు. బాయిల్డ్ రైస్‌లోనూ అదే పరిస్థితి ఉంటుందని, దొడ్డురకం ధాన్యం మిల్లింగ్ చేస్తే 64 శాతానికి మించి మిల్లింగ్ రావడం లేదని, కొత్త విధానాన్ని ప్రభుత్వం ప్రకటిస్తే తప్ప మిల్లింగ్ సాధ్యం కాదని అంటున్నారు. సీఎంఆర్ పర్సంటేజీలు తగ్గించాలనే విషయంలో మిల్లర్ల డిమాండ్‌ల మేరకు నిపుణులతో టెస్ట్ మిల్లింగ్ చేయించాలని, ఏ మేరకు బియ్యం వస్తాయో ఖరారు చేసి మిల్లింగ్ చేయాలని కోరుతున్నారు. దీంతో జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతున్నా అగ్రిమెంట్లు జరగకపోవడంతో కొనుగోలు చేసే ధాన్యం తరలించడం సమస్యగానే మారుతుందని భావిస్తున్నారు. మరోవైపు విద్యుత్ సమస్య కూడా మిల్లర్లను వెంటాడుతోంది.

సీఎంఆర్‌కు 'కాప్రా' సమస్య

జిల్లాలో సీఎంఆర్ బియ్యం సరఫరా కొనసాగుతూనే ఉంది. మరోసారి సీఎంఆర్ బియ్యం సరఫరాకు ఈ నెల చివరి వరకు ఎఫ్‌సీఐ అవకాశం ఇచ్చింది. జిల్లాలోని మిల్లర్లు ఎఫ్‌సీఐకు బియ్యం సరఫరా చేయడానికి

మిగితా 8లో

న్యూస్ బాక్స్

బ్రహ్మోత్సవాల ఆదాయం రూ.7.19 లక్షలు

సిరిసిల్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల ఆదాయం రూ.7.19 లక్షలు లభించింది. సోమవారం ఆదాయ లెక్కలను ఈవో మారుతీరావు వెల్లడించారు. 2023 సంవత్సరం బ్రహ్మోత్సవాల్లో రూ.7.50 లక్షల ఆదాయం రాగా ఈ సారి రూ.7.19 లక్షలు వచ్చింది. వేలం ద్వారా రూ.1,52,232, టికెట్ల ద్వారా రూ.2,55,530, హుండీ ద్వారా రూ.2,68,165, ఒడిబియ్యం, చీరలు, ఇతర ఆదాయాలు రూ.43,586 లభించినట్లు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల్లో ప్రసాదం కౌంటర్ వద్ద ఒక భక్తుడు ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లించినపుడు ఓ వర్గానికి చెందిన వ్యక్తి పేరు వచ్చింది. ఈ మేరకు భక్తుడు కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ప్రసాదం కౌంటర్ వద్ద వెంటనే స్కానర్ తొలగించారు. అన్యమతస్తులు ఎవరూ ప్రసాదం తయారు చేయడం లేదని పేర్కొన్నారు. పులి మల్లేశం లడ్డూ, పులిహోర టెండర్ పొంది తయారు చేశారని తెలిపారు.

వ్యవసాయ అధికారులకు సన్మానం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీపై వచ్చిన ఎల్లారెడ్డిపేట మండల వ్యవసాయ శాఖ అధికారులు లను స్థానిక కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం సన్మానించారు. ఏవో కవిత, ఏఈవోలు అనూష, సాయివైష్ణవి, శ్రీశైలంకు అభినందనలు తెలిపారు. నాయకులు నవాబ్, తిరుపతి, రాములు, చందు, శంకర్, బాల్‌రెడ్డి, శివకుమార్, శ్రీనివాస్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు

ఇంటర్వ్యూ

- సీజనల్ వ్యాధులపై అప్రమత్తం
- ఆస్పత్రుల్లో సిబ్బంది కొరత
- డాక్టర్ ఎం.వసంతరావు, జిల్లా వైద్యాధికారి



డాక్టర్ వసంతరావు, జిల్లా వైద్యాధికారి

(ఆంధ్రజ్యోతి సిరిసిల్ల)

జిల్లా ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఎం. వసంతరావు తెలిపారు. మెరుగైన వైద్యం ప్రజలకు అందేలా చూడడమే లక్ష్యమని, జిల్లాలో ఎప్పటికప్పుడు అన్ని విభాగాలను పర్యవేక్షిస్తున్నామని అన్నారు. ఎక్కడైనా సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరిస్తున్నామని, సిబ్బంది కొరత ఉన్నా వైద్య సేవలకు ఇబ్బందులు రానివ్వడం లేదని తెలిపారు. సోమవారం ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో సీజనల్ వ్యాధులు, వైరల్ జ్వరాలు డెంగ్యూ కేసుల నమోదుపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

డీఎంహెచ్‌వో : జిల్లాలో సీజనల్ వ్యాధులు, జ్వరాలు ప్రబలుతున్నాయి. డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయి. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందిస్తున్నాం. నిరంతరం ఫీవర్ సర్వే కొనసాగిస్తున్నాం. గత నెలలో 66,395 మంది ఆస్పత్రుల్లో వైద్య సేవలకు రాగా 3557 మంది జ్వర పీడితులు ఉన్నారు. పది డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఈ నెలలో గడిచిన 20 రోజుల్లో 37,040 మంది ఆస్పత్రులకు రాగా 1432 మంది జ్వర పీడితులు ఉన్నారు. ఆరు డెంగ్యూ కేసులు నమోదయ్యాయి. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా వైద్య సేవలు అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో వైద్యులు, సిబ్బంది కొరత ఉందా?

డీఎంహెచ్‌వో : జిల్లాలో వైద్యులు, సిబ్బంది కొరత ఉంది. 29 మంది మెడికల్ ఆఫీసర్లకు 18 మంది ఉన్నారు. ఏఎంలో 61 మందికి 57 మంది ఉన్నారు. సిబ్బంది కొరత ఉన్నా

మిగతా 8వ పేజీలో...

దళారీ వ్యవస్థకు స్వస్తి పలికిన కాంగ్రెస్

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్
- కొనుకోలు కేంద్రాల ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్

8

ప్రజావాణికి విన్నపాల వెల్లువ

- సమస్యలను పరిష్కరించాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



దరఖాస్తు స్వీకరిస్తున్న కలెక్టర్

8

ప్రజా అవసరాలు తీర్చేలా అభివృద్ధి

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



వివరాలు తెలుసుకుంటున్న విప్, కలెక్టర్

8

బాధితులకు సత్వర న్యాయం



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వీర్నపల్లి, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి) : పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై విచారణ చేపట్టి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. వీర్నపల్లి మండల పోలీస్ స్టేషన్‌ను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణ కోసం అన్ని గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలన్నారు. గ్రామ పోలీస్ అధికారులు ప్రజలతో సత్సంబంధాలను పెంచుకోవాలన్నారు. ఏవైనా సంఘటనలు జరిగితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలన్నారు. అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలన్నారు. అంతకుముందు పోలీస్ స్టేషన్ పరిసరాలను, రికార్డులను పరిశీలించారు. సీఐ శ్రీనివాస్ గౌడ్, ఎస్సై ఎల్లాగౌడ్ ఉన్నారు.

ఓటరు జాబితా రూపకల్పనపై సమన్వయం చేసుకోవాలి



హాజరైన కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అధికారులు

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఓటరు జాబితా రూపకల్పనపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని, 2024-25 సంవత్సరానికి సంబంధించిన ఓటరు జాబితా సవరణను ప్రణాళికా బద్ధంగా స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశించారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్‌లో హైదరాబాద్ నుంచి గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాల ఓటరు జాబితా రూపకల్పనపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, భీమ్యా నాయక్ హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుకు వస్తున్న దరఖాస్తుల విచారణ మిషన్ మోడ్ లో పూర్తి చేయాలన్నారు. పెండింగ్ ఎమ్మెల్సీ స్థానాల ఓటర్ నమోదు దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలలో పాల్గొనేందుకు అర్హులైన ఓటర్లు తమ పేర్లను ఓటరు జాబితాలో నవంబరు 6 లోపు నమోదు చేయాలన్నారు. స్వీప్ కార్యక్రమాలు పక్కాగా చేపట్టాలని, ప్రత్యేకంగా నోడల్ అధికారులు నియమించాలని అన్నారు. అక్టోబరు 29న డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల చేయనున్నట్లు చెప్పారు. అభ్యంతరాలను నవంబరు 29 వరకు స్వీకరిస్తామని, డిసెంబరు 26 వరకు అభ్యంతరాలను పరిష్కరించి జనవరి 6న తుది ఓటరు జాబితా ప్రచురించాలని తెలిపారు. వేములవాడ రెవెన్యూ డివిజన్ అధికారి రాజేశ్వర్, సిరిసిల్ల, వేములవాడ తహసిల్దార్‌లు మహేష్, స్వీప్ నోడల్ అధికారి జెడ్పీ సీఈవో వినోద్ కుమార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులు, మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తిస్తే చర్యలు

సిరిసిల్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు, మహిళలపై అసభ్యంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని, విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు నరేందర్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. సోమవారం సిరిసిల్లలో విలేకరులతో మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలో గీతానగర్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో షీటీమ్ అవగాహన కార్యక్రమం నిర్వహించారని, నరేందర్ అనే ఉపాధ్యాయుడు అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఫిర్యాదు చేశారని తెలిపారు. విచారణ చేపట్టి సిరిసిల్ల పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వేధింపులకు గురైతే షీటీం నంబరు 8712656425కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

అనుమానాస్పద వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

వేములవాడ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో సూచించారు. వేములవాడ పట్టణంలోని మెయిన్ రోడ్డులోని ఓ దుకాణంలోకి వినియోగదారుడిగా వచ్చి కొన్ని విలువైన వస్తువులను దొంగిలించి జారుకున్న ఓ గుర్తు తెలియని వ్యక్తికి సంబంధించి సీసీ కెమెరాల్లో రికార్డయిన చిత్రాలను సోమవారం పోలీసు శాఖ విడుదల చేసింది. వేములవాడ పట్టణంలోని మటన్ మార్కెట్ ప్రాంతంలో చికెన్ సెంటర్‌తోపాటు నీటి డ్రమ్ములు విక్రయించే కూరగాయల ఆగయ్య అనే వ్యక్తి దుకాణంలో ఎవరూ లేనట్లు గమనించిన ఆగంతకుడు దుకాణంలోని బీరువాను తెరిచి విలువైన వస్తువులు ఎత్తుకెళ్లాడు. అప్పటికే అక్కడికి చేరుకున్న దుకాణం యజమాని కుమారుడు ప్రశ్నించగా నీటి డ్రమ్ము ధర తెలుసుకుని ఎక్కువ ఉందంటూ అక్కడినుంచి జారుకున్నాడు. సదరు వ్యక్తి వెళ్లిపోయిన అనంతరం బీరువా తలుపు తెరిచి ఉన్నట్లు గమనించిన దుకాణం యజమాని లోపల పరిశీలించగా బీరువాలోని విలువైన వెండి ఇతర వస్తువులు మాయమైనట్లు గుర్తించి పోలీసులను ఆశ్రయించారు. దీంతో ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాలు రికార్డైన అనుమానాస్పద వ్యక్తి ఫొటోలను మీడియాకు విడుదల చేశారు.

వర్షానికి నేలవాలిన వరి

బోయినపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బోయినపల్లి మండలంలోని తడగొండ అనంతపల్లి మల్కాపూర్ గ్రామాల్లో సోమవారం కురిసిన అకాల వర్షంతో వరి పంట నేల కొరిగింది. కోత సమయంలో పంట నేలకొరగడంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. అనంతపల్లి గ్రామంలో యామ జనార్దన్ వ్యవసాయ పనులకు వెళ్లగా పిడుగు పడడంతో అస్వస్థకు గురయ్యాడు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన సెస్ డైరెక్టర్

రుద్రంగి, అక్టోబరు 21, (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌ను సోమవారం సెస్ డైరెక్టర్ ఆకుల గంగారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం మాట్లాడుతూ రుద్రంగి మండల కేంద్రంలో సెస్ సేవ సదన్ భవన నిర్మాణానికి ప్రభుత్వ స్థలం కేటాయించాలని కోరినట్లు చెప్పారు. సెస్ ఏఈ కుమారస్వామి, సిబ్బంది ఉన్నారు

కొండ చిలువ హతం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ శివారులో రైతులు కొండ చిలువను హతమార్చారు. గ్రామ శివారులోని దేవరెడ్డి వ్యవసాయ పొలంలో సోమవారం కొండ చిలువ ప్రత్యక్షమైంది. భయాందోళన చెందిన రైతులు చం పేశారు. కొండ చిలువ సుమారు 3 మీటర్ల పొడవు, 20 కిలోల బరువు ఉంటుందని పేర్కొన్నారు.

రోడ్డు సౌకర్యం కల్పించండి

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల అర్బన్ పరిధిలోని పెద్దూర్ శివారులో సర్వే నంబరు 422లో ఉన్న తమ వ్యవసాయ భూములకు వెళ్లేందుకు మెడికల్ కళాశాలకు చెందిన భూముల నుంచి రోడ్డు సౌకర్యం కల్పించాలని రైతులు కోరారు. సోమవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు వినతి పత్రాన్ని అందజేశారు. సర్వే నంబరు 408లో ఉన్న భూముల్లో నుంచి గతంలో రోడ్డును ఉందని, దాన్ని మెడికల్ కళాశాలకు చెందిన భవనాలను నిర్మించేందుకు రెవెన్యూ అధికారులు కేటాయించారని తెలిపారు. ఆ రోడ్డు పోతే పొలాలకు వెళ్లడానికి ఇబ్బందులు పడుతామని, అలాగే ఉంచాలని కోరారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

చందుర్తి అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్‌లు ప్రభాకర్, అభినయ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న క్షేత్రం భక్తజన సంద్రం



ఆలయ ఆవరణలో భక్తుల సందడి

వేములవాడ కల్చరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి క్షేత్రం సోమవారం భక్తజన సంద్రంగా మారింది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. తెల్లవారు జాము నుంచి భక్తులు కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించి ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించారు. అనంతరం క్యూలైన్ ద్వారా ఆలయంలో చేరుకొని రాజరాజేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కోడెమొక్కు చెల్లింపునకు సుమారుగా మూడు గంటలపాటు నిరీక్షించినట్లు భక్తులు తెలిపారు. ఆలయంలోని తూర్పు వైపున ఉన్న గండదీపంలో నూనెపోస్తూ గండాలు తొలగిపోవాలని వేడుకున్నారు. ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఆలయాధికారులు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, గజివెళ్ల రమేష్‌బాబు, సూపరింటెండెంట్ తిరుపతిరావు, నరేందర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ రాజేందర్, పీఆర్వోలు అశోక్, ఎడ్ల శివసాయి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోలీస్ అమరుల త్యాగాలు చిరస్మరణీయం

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- పోలీసు అమరులకు ఘన నివాళి



నివాళి అర్పిస్తున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్, కమాండెంట్ శ్రీనివాసరావు

చందుర్తి, అక్టోబర్ 21(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి ఆశయాల సాధన దిశగా ముందుకు సాగాలనికలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. చందుర్తి మండలం లింగంపేట శివారులోని పోలీస్ అమరవీరుల స్తూపం వద్ద ఎస్పీ అఖిల్ మహాజన్, అమరవీరుల కుటుంబ సభ్యులు, పోలీస్ అధికారులతో కలసి సోమవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల కోసం ప్రాణాలను ఫణంగా పెట్టిన పోలీస్ అమరవీరుల త్యాగనిరతి ఫలితమే నేటి శాంతి, సౌభ్రాతృత్వం అని కొనియాడారు. పోలీసు అమరుల త్యాగం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. అక్టోబరు 21నుంచి 31 వరకు జాతీయ ఐక్యత కోసం ప్రజలకు పోలీసులు మరింత చేరువయ్యేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ సమాజంలో శాంతి స్థాపన కోసం అసాంఘిక శక్తులతో జరిపిన పోరులో అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. అమరుల త్యాగాలను స్మరించుకోవాల్సిన బాధ్యత అన్ని వర్గాల ప్రజలపై ఉందన్నారు. పోలీస్ అమరవీరులను స్మరిస్తూ ఈ నెల 31 వరకు రక్తదాన శిబిరాలు, సైకిల్, క్యాండిల్ ర్యాలీ, 2కె రన్, ఓపెన్ హౌస్ వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పోలీస్ అమరవీరుల కుటుంబాలకు దగ్గరికి వెళ్లి వారి త్యాగాలకు గుర్తుగా నివాళులు అర్పించనున్నామన్నారు. వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి, అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ మురళి కృష్ణ, సీఐలు వెంకటేశ్వర్లు, కృష్ణ, మురళి, శ్రీనివాస్, శ్రీనివాస్ గౌడ్, ఎస్సైలు మారుతి, అశోక్, రమేష్, ఏఎస్ఐ బాపు పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల అర్బన్ పరిధిలోని 17వ పోలీస్ బెటాలియన్‌లో స్మృతి పరేడ్ నిర్వహించారు. అమరవీరుల స్తూపం వద్ద 17వ పోలీస్ బెటాలియన్ కమాండెంట్ శ్రీనివాసరావు నివాళి అర్పించారు. అసిస్టెంట్ కమాండెంట్ ఉదయ్‌భాస్కర్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ప్రమీల, అధికారులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: వీర్నపల్లి మండలం గర్జనపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు పోలీస్ అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.

ముస్తాబాద్: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఎస్సై సీహెచ్ గణేశ్, ఏఎస్సై వెంకటరమణ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

భార్యను వేధించిన భర్తకు ఏడాదిన్నర జైలు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): భార్యను వేధించిన భర్తకు ఏడాదిన్నర జైలు శిక్షతోపాటు రూ.10వేల జరిమానా విధిస్తూ సోమవారం సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు వెల్లడించారు. దోమకొండ మండలం తుల్జాపూర్‌కు చెందిన సుంకరి రాజుకు ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన మేఘమాలతో 2010లో వివాహం జరిగింది. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. కొంతకాలం తర్వాత అదనపు కట్నం తీసుకురావాలని భర్త వేధింపులకు గురిచేశాడు. 2015లో ముస్తాబాద్ పోలీస్ స్టేషన్‌లో భర్త రాజుపై ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై మారుతి కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. పీపీ సందీప్ వాదించగా ముస్తాబాద్ ఎస్సై గణేశ్, సీఎంస్ ఎస్సై రవీందర్‌నాయుడు, కోర్టు కానిస్టేబుల్ దేవేందర్ ఏడుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. నిందితుడు సుంకరి రాజుపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ప్రవీణ్ తీర్పు చెప్పారు.

గంభీరావుపేటలో యువకుడి అదృశ్యం

గంభీరావుపేట, అక్టోబర్ 21: (ఆంధ్రజ్యోతి) గంభీరావుపేట మండల కేంద్రంలోని దోసల గూడెంకాలనీకి చెందిన బరిగెల బాబు అనే యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ నెల 19న ఇంటి నుంచి వెళ్లిన బాబు తిరిగి రాలేదు. బాబు కోసం మూడు రోజులుగా కుటుంబ సభ్యులు వెతుకుతున్నారు. ఆచూకీ లభ్యం కాక సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

అనారోగ్యంతో 'కేశోరాం' కార్మికుడి ఆత్మహత్య

పాలకుర్తి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బసంత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కేశోరాం వర్కర్స్ కాలనీలో నివాసముంటున్న కంపెనీ కార్మికుడు ఆదివారం రాత్రి ఉరేసుకొని మృతి చెందినట్లు బసంత్‌నగర్ ఎస్‌ఐ ఆర్ స్వామి తెలిపారు. ఎస్‌ఐ సోమవారం వివరాలను వెల్లడించారు. కన్నం కేశవులు(55) కంపెనీలో పర్మినెంటు వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కొన్ని రోజులుగా బీపీ, షుగర్, ఇతర అనారోగ్య సమస్యలతో విధులకు సరిగా హాజరు కాలేదు. దీంతో మనోవేదనకు గురై తన క్వార్టర్‌లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడు కేశవులు తండ్రి కన్నం నాగయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్‌ఐ తెలిపారు. ఆదివారం బసంత్‌నగర్ తెలుగు మీడియం పాఠశాలలో జరిగిన పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న ఆయన అదే రోజు రాత్రి ఆత్మహత్య చేసుకోవడంతో విషాదఛాయలు అలుముకున్నాయి.

జీవితంపై విరక్తితో వృద్ధుడి ఆత్మహత్య

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గసాగర్ గ్రామంలో జీవితంపై విరక్తి చెంది ఓ వృద్ధుడు సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై చిరంజీవి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కుమ్మ వెంకన్న(65) వృద్ధుడు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కొంత కాలం నుంచి మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం మధ్యాహ్నం గ్రామంలోని స్వంత కొట్టంలో దులానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య దేవవ్వ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఆస్పత్రికి వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం

- తండ్రీ కొడుకులకు తీవ్ర గాయాలు

సుల్తానాబాద్, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రిని ఆసుపత్రిలో చూపించి తిరిగి ఇంటికి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులిద్దరూ తీవ్రంగా గాయపడిన సంఘటన సుల్తానాబాద్ మండలంలోని భూపతిపూర్ స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై సోమవారం జరిగింది. పెద్దపల్లి మండలంలోని గౌరెడ్డిపేటకు చెందిన మల్లేశంను ఆస్పత్రిలో చూపించడం కోసం ఆయన కొడుకు మధునయ్య బైక్‌పై కరీంనగర్ వెళ్లారు. తండ్రిని అస్పత్రిలో చూపించి మందులు తీసుకుని తిరిగి సోమవారం రాత్రి స్వగ్రామానికి వస్తుండగా వీరి బైక్‌ను వెనక నుంచి వేగంగా వస్తున్న ఇసుక లారీ భూపతిపూర్ స్టేజీ వద్ద రాజీవ్ రహదారిపై ఢీకొట్టింటి. ఈ ప్రమాదంలో తండ్రికి కుడి కాలు తెగిపడిపోగా, కొడుకకు కాళ్లకు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే కరీంనగర్ అస్పత్రికి అంబులెన్సులో తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ ఆగకుండా వెళ్లిపోయిందని గ్రామస్థులు తెలిపారు.

భూమి అమ్మి మోసం చేసిన వారిపై కేసు

వీణవంక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భూమి అమ్మి కొంత భూమి రిజిస్ట్రేషన్ చేసి మిగతా భూమి రిజిస్ట్రేషన్ చేయకుండా మోసం చేసిన వారిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. హిమ్మత్‌నగర్ గ్రామస్థుడైన మేక రమేష్‌కు కరీంనగర్‌కు చెందిన అన్‌రెడ్డి ప్రకాష్‌రెడ్డి అన్‌రెడ్డి అరుణ వారికున్న ఏడెకరాల 19 గుంటలు రూ. 71 లక్షల 50 వేలకు అమ్ముతామని నమ్మబలికి మొత్తం రూపాయలు ముట్టిన తర్వాత ఐదు ఎకరాల 32 గుంటలు మాత్రమే పట్టా చేశారని తెలిపారు. మిగతా భూమిని పట్టా చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని, రిజిస్ట్రేషన్ చేయమని అడిగితే చంపుతామని బెదిరిస్తున్నారని, తన వద్ద పైసలు తీసుకొని మోసం చేశారని మేక రమేష్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

వెల్గటూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముక్కట్రావుపేట గ్రామానికి చెందిన మేకల రాజయ్య(40) అనే వ్యక్తి సోమవారం అనుమానాస్పదంగా మృతి చెందినట్లు ఎస్సై ఉమాసాగర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు రాజయ్య కొద్ది కాలంగా మద్యానికి బానిసయ్యాడు. సోమవారం ఉదయం ఇంటిలో అనుమానాస్పదంగా మృతి చెంది ఉన్నట్లు కుటుంబీకులు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడి సోదరుడు మేకల మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. మృతికి గల కారణాలు తెలుసుకోవడానికి శవాన్ని పంచనామా నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

యువకుడి అదృశ్యం

ఫైటింక్లయిన్‌కాలనీ, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పోతనకాలనీకి చెందిన మంథని ప్రవీణ్‌కుమార్ (29) అదృశ్యమైనట్టు గోదావరిఖని టూటౌన్ పోలీసులు తెలిపారు. 2 ఇంక్లయిన్ గనిలో పనిచేస్తున్న ప్రవీణ్‌కు ఇటీవల నిశ్చితార్థం జరిగింది. బంధువు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు ఊరికి వెళ్లి సోమవారం తెల్లవారు జామున ఇంటికి వచ్చే సరికి ప్రవీణ్ కనిపించలేదు. ప్రవీణ్ మొబైల్ స్విచ్ ఆఫ్ రావడంతో ఇరుగు పొరుగు వారికి, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ప్రవీణ్ తండ్రి మంథని రాజయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గంజాయి కేసులో ఒకరి అరెస్ట్

చందుర్తి, కోనరావుపేట, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి) : గంజాయి సరఫరా కేసులో పరారీలో ఉన్న ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. కోనరావుపేట మండలం సుద్దాల గ్రామ శివారులో జూలై 25న కావేరి కాటన్ మిల్ వద్ద గంజాయి సరఫరా చేస్తున్న ఏడుగురిపై కేసు నమోదైంది. వారిలో ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్ పంపారు. ఈ కేసులో మర్తనపేట గ్రామానికి చెందిన నీరటి సాయికుమార్ పరారీలో ఉండగా సోమవారం రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

91 గ్రాముల గంజాయి స్వాధీనం

మంథని, అక్టోబర్ 21: స్థానిక బస్ డిపో సమీపంలో మంథనిలోని పోచమ్మవాడకు చెందిన కుడుదుల సూర్యవర్ధన్‌అనే యువకుడి వద్ద నుంచి 91 గ్రాముల ఎండు గంజాయిని సోమవారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు. తమకు అందిన సమాచారంతో తాము బస్ డిపో సమీపంలో చూడగా సూర్యవర్ధన్ అనుమానాస్పదంగా ఉండి తమను చూసి పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకొని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతని వద్ద ఉన్న ప్లాస్టిక్ కవర్ తనిఖీ చేయగా 91 గ్రాముల ఎండు గంజాయి ఉన్నట్లు గుర్తించామన్నారు. మహారాష్ట్రలోని చంద్రపూర్ వెళ్లి తనకు పరిచయం ఉన్న కీర్తిక్ అనే వ్యక్తి దగ్గర గంజాయి కొనుగోలు చేసినట్లు సూర్యవర్ధన్ వెల్లడించారన్నారు. తన వద్ద ఉన్న గంజాయిని స్థానిక శ్రీపాదకాలనీలో తనకు పరిచయస్థులైన తైదల సురేష్, పెంద్యాల సునీల్, ఆసంపెల్లి తరుణ్, లక్క రవివర్మలతో కలిసి గత కొంత కాలంగా గంజాయిని తాగున్నట్లు సూర్యవర్ధన్ వెల్లడించినట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



పొలాస ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానము

రైతు నేస్తం..

వ్యవసాయ అభివృద్ధి, రైతుల శ్రేయస్సే ధ్యేయంగా జగిత్యాల జిల్లాలోని పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం పనిచేస్తోంది. వ్యవసాయ రంగంలో ఉత్తర తెలంగాణకు పొలాల క్షేత్రం తలమానికంగా నిలుస్తోంది. ప్రొఫెసర్ జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వ విద్యాలయానికి అనుబంధంగా వ్యవసాయ కళాశాలను ఏర్పాటు చేశారు. కళాశాలలో బీఎస్సీ, ఎమ్మెస్సీ అగ్రికల్చర్ స్పెషలైజేషన్, జెనెటిక్స్ తదితర కోర్సులను అందిస్తున్నారు. ఇక్కడ కోర్సు పూర్తి చేసుకున్న పలువురు విద్యార్థులు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో పలు ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఇక్కడ తయారైన పలు రకాల విత్తనాలు రాష్ట్ర స్థాయిలో ప్రాచుర్యం పొందాయి. ఎప్పటికప్పుడు అధిక దిగుబడిని అందించే కొత్త కొత్త వంగడాలను సృష్టిస్తూ పరిశోధన స్థానం తనదైన ప్రత్యేకతను చాటుకుంటోంది.

పొలాస క్షేత్రం

ఉత్తర తెలంగాణకు తలమానికంగా వ్యవసాయ కేంద్రం

- అనుబంధంగా వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల
- వ్యవసాయ డిగ్రీ, పీజీ కళాశాలలు



జగిత్యాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పొలాస ప్రాతీయ వ్యవసాయ పరిశోధన క్షేత్రా నికి ప్రత్యేక స్థానం ఉంది. 1983 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు పరిశోధన స్థానాన్ని ప్రారంభించారు. సుమారు 48.96 హెక్టార్ల విస్తీర్ణంలో పరిశోధన స్థానం ఉంది. ఈ కేంద్రం పరిధిలో కరీంగనర్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల పరిశోధన క్షేత్రాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ పరిశోధన స్థానం తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు చెందిన రైతులకు అవసరమైన సేవలు అందిస్తోంది. కళాశాల నూతన వంగడాలపై పరిశోధనలు చేస్తూ, రైతులకు సాగులో మెళకువలు చెప్తూ, సలహాలు, సూచనలను ఎప్పటికప్పుడు అందిస్తూ రైతు నేస్తంగా పొలాస వ్యవసాయ పరిశోధన క్షేత్రం కృషి చేస్తోంది. పలు ఆటు పోట్లను అధిగ మిస్తూ ప్రస్తుతం రాష్ట్రంలోనే అత్యంత ఉత్తమ ప్రదర్శన క్షేత్రంగా ఖ్యాతి గడించడం పట్ల జిల్లా రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


వ్యవసాయ ప్రయోగాలు చేస్తున్న ప్రొఫెసర్లు, విద్యార్థులు

అనుబంధ కళాశాలలు ఇవీ..

పొలాస వ్యవసాయ పరిశోధన స్థానానికి అనుబంధంగా 2008 సంవత్సరంలో వ్యవసాయ డిగ్రీ కళాశాల, 2013లో వ్యవసాయ పీజీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు అయ్యాయి. వ్యవసాయ కళాశాలలో 150 సీట్లు, పీజీలో 14 సీట్లు ఉన్నాయి. ఈ కళాశాలలో ప్రవేశం పొందు తున్న వారిలో అధికంగా బాలికలు ఉంటున్నారు. బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల ప్రారంభం అయ్యింది. పక్కా భవనం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్న విద్యార్థులకు రూ. 20 కోట్లతో పక్కా భవనం నిర్మించడంతో సమస్య సద్దుమణిగింది. ప్రస్తుతం వ్యవసాయ కళాశాలలో ప్రతీ యేటా సుమారు 150 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందుతున్నారు. ఒకే ప్రాంగణంలోనే వ్యవసాయ డిగ్రీ, పీజీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల ఉండడం వ్యవసాయ విద్యావ్యాప్తికి దోహదపడుతోంది.

తొలినాళ్లలో అవస్థలు, అసౌకర్యాలతో ఇబ్బందులు పడ్డ పరిశోధన స్థానం నేడు అన్ని హంగులతో వ్యవ సాయరంగంలో ఒక వెలుగు వెలుగుతూ రైతన్నలకు పరిశోధన ఫలాలు పంచుతూ జిల్లాకే తలమాణికంగా నిలుస్తోంది. కార్యాలయ నిర్వహణతో పాటు, పరిశోధనలకు సైతం ఊతం ఇస్తూ వంగడాల ఉత్పత్తిలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ముందు వరుసలో ఉన్నారు. ఏటా విత్తన మేళా నిర్వహించి రైతులకు అవసరమైన విత్తనాలను అందిసున్నారు.

అధిక దిగుబడినిచ్చే విత్తనాల కోసం..

ప్రధానంగా జిల్లాకు ఆయువుపట్టుగా ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద పండే పంటలైన వరి, మొక్కజొన్న, నువ్వులు, వేరుశనగ పంటలకు సంబంధించి అధిక దిగుబడినిచ్చే విత్తనాలు, కీటకాలు, చీడ పీడలను, వాతావరణ పరిస్థితులను తట్టుకొని నిలబడి, రైతుకు లాభాలు ఇచ్చే పంటల విత్త నాలను పరిశోధన కేంద్రంలో కనిపెడుతున్నారు. వీటిని రైతులతో పాటు ప్రభుత్వం ద్వారా ప్రైవేటు విత్తన సంస్థలకు అందజేస్తారు. జగిత్యాల పరిశోధన స్థానంలో తయారైన పలు వరి, మొక్కజొన్న, నువ్వు విత్తనాలు రాష్ట్ర స్థాయిలో ప్రాచుర్యం పొందాయంటే పరిశోధనల ఫలితం, శాస్త్రవేత్తల కృషికి అద్దం పడుతున్నాయి.


క్షేత్ర స్థాయి వ్యవసాయ పనుల్లో కళాశాల విద్యార్థులు

మేలైన వంగడాలకు కేరాఫ్‌గా...

రైతులెంత చెమటోడ్చినా వేలకు వేలు పెట్టుబడి పెట్టిన దిగుబడి లేక నష్టాల్లో దిగబడి పోతున్నారంటే నాణ్యమైన వంగడాలు అందక పోవడమే కారణం అని భావిస్తున్నారు. ఈ సమస్యను అధిగమించడం పై పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. వరి ప్రధాన పంటగా సాగుచేస్తున్న తెలంగాణ రాష్ట్రంలో వరి పరిశోధనలకు కేంద్ర బిందువుగా నాణ్యమైన విత్తనాలను అందించడమే లక్ష్యంగా జగిత్యాల జిల్లాలో గల పొలాస వ్యవసాయ పరిశోధన స్థానం పని చేస్తుంది. ఇక్కడ రూపొందించిన విత్తనాలు తెలంగాణతో పాటు ఉత్తర భారత దేశంలో సాగులో ఉండడం గమనార్హం.

ఇక్కడి నుంచి వరిలో జగిత్యాల సన్నాలు, పొలాస ప్రభ, జగిత్యాల సాంబ, కరీంనగర్ సాంబ, జగిత్యాల మసూరి, ప్రాణహిత, మానేరు, బతుకమ్మ రకాలను విడుదల చేశారు. నువ్వుల్లో హిమ చందన, రాజేశ్వరీ, శ్వేతాతిల్, పసుపులో సుగుణ, సుదర్శన వేరుశనగలో జేజీఎల్ 98 రకాలను శాస్త్రవేత్తలు రూపొందిం చారు. పంటల సరళి, కొత్తకొత్త రకాలతో ఈ పరిశోధన స్థానం విశేష స్థానం పొందింది. పరిశోధన ఫలాలను అన్నదాతల క్షేత్రాలకు చేరవేసే శాస్త్రవేత్తలు నిరంతరం కృషి చేస్తున్నారు. ఈ వంగడాలన్నీ ఉల్లి కోడును, అగ్గి తెగులును సమర్థవంతంగా ఎదుర్కోగలిగే సామర్థ్యం ఉన్నవే కావడంతో రైతుల్లో మంచి స్పందన లభిస్తుంది. అనేక రకాల వరి, ఇతర వంగడాలపై పరిశోధనలు, ప్రదర్శనలు ఏటా జరుగుతుండడం, రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించడం, సాగులో మెళకులవలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తూ దినదినాభివృద్ధి చెందుతోంది.


జెజీఎల్ 28545 సన్న వరి గింజ రకం ప్రదర్శన

న్యాయం చేయాలని బాధిత కుటుంబీకుల ఆందోళన

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): తన భర్తను చంపింది ఒక్కరు కాదు, ముగ్గురని వారిపై చర్యలు తీసుకోకుంటే ఆత్మహత్య చేసుకుంటానంటూ డీజిల్ డబ్బాతో మృతుడి భార్య బంధువులతో కలిసి సోమవారం పట్టణంలో ఆందోళన చేపట్టింది. మల్లాపూర్ మండలం ఓబులపూర్ గ్రామానికి చెందిన పల్లపు సాయిలును తమ్ముడు ఆదివారం హతమార్చాడు.

అయితే మృతుడు సాయిలును చంపింది సాయిలు తమ్ముడితో పాటు మరో ఇద్దరు ఉన్నారని మృతుడి భార్య నవ్య ఆరోపిస్తూ తమ కుటుంబానికి న్యాయం చేసే వరకు మృతదేహాన్ని తీసుకెళ్లేది లేదని మొదట మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రి ముందు నిరసనకు దిగింది. అనంతరం బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నవ్య మాట్లాడుతూ తన భర్త సాయిలును మొత్తం ముగ్గురు కలిసి పక్కా


డీజిల్ డబ్బాతో అందోళన చేస్తున్న మృతుడి భార్య నవ్య

ప్రణాళిక ప్రకారమే హత్య చేశారని ఆరోపించారు. మృతుడి మెడలో తులం బంగారం, 40 వేల విలువగల ఫోన్. పది వేల నగదు లాక్కొని తన భర్తపై ఇద్దరు తమ్ముళ్లు, మరో మేకల మంద యాజమానితో కలిసి హత్య చేశారని తెలిపింది. గతంలో భూ వివాదాలు ఉండేవని గ్రామ పెద్దల సమక్షంలో పంచాయితీలు జరిగాయని, కేసులు కూడా నమోదయ్యాయని ఆమె తెలిపింది. తన భర్త మృతి చెందడంతో ఇద్దరు కూతుళ్లకు ఆధారం లేదని కన్నీరు మున్నీరైంది. తన పిల్లలకు న్యాయం చేయాలని లేదంటే డీజిల్‌తో నిప్పంటించుకుంటానని ఆమె హెచ్చరించింది. సంఘటన స్థలానికి డీఎస్పీ ఉమామహేశ్వరరావు చేరుకుని బాధితురాలు నవ్యతో మాట్లాడి న్యాయం జరిగే లా చూస్తామని నిందితులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. సీఐ నిరంజన్‌రెడ్డి, ఎస్‌ఐ కిరణ్ కుమార్‌లు ఉన్నారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీలకు ఎంపిక

మంథని, అక్టోబరు 21: ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు మంథని జేకేఏ షోటోకాన్ కరాటే విద్యార్థులు ఎంపికైనట్లు ఇన్‌స్ట్రక్టర్ కోంద్ర నాగరాజు సోమవారం తెలిపారు. గోదావరిఖని ఆర్‌సీఓఏ క్లబ్‌లో పెద్దపల్లి జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ కొమురోజు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా 68వ ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలు జరిగాయి. ప్రతిభను కనబర్చిన తమ విద్యార్థులు అండర్-14 విభాగంలో వడ్లకొండ శ్రీనిత, అండర్-17 విభాగంలో తోట హాసిని, రాగుల సహస్ర, బేరా ఆదిత్య తేజ, పొట్ల శ్రావణ్‌కుమార్, డుల్‌గచ్ దేవాన్ష్, రంగు శ్రీచరణ్‌లు రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలకు ఎంపి కైనట్లు తెలిపారు. వీరిని గోదావరిఖని ఏసీపీ మడత రమేష్, జేకేఏ సౌత్ జోన్ ఇంచార్జి రాపోలు సుదర్శన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ శ్రీనివాస్ అభినందించారు.

అరటి పండ్ల గోదాంపై దాడులు

మెట్‌పల్లిటౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎండి ఉస్మాన్ అలీ బ్రదర్స్ ఫ్రూట్స్ గోదాంలో సోమవారం ఫెడ్‌ఇన్‌స్పెక్టర్ అనూష సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాంలో నిల్వ ఉంచిన అరటి పండ్లను పరిశీలించారు. అరటి పండ్లు త్వరగా పక్వానికి రావడానికి విషపూరితమైన ఇథిలీన్‌ను అతిగా వాడుతున్నట్లు గుర్తించి గోదాంను సీజ్ చేసినట్లు తెలిపారు.

గోదావరిలో మునిగిన ఇసుక ట్రాక్టర్

మల్లాపూర్, అక్టోబరు, 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని వాల్గొండ సమీపంలోని గోదావరిలో సోమవారం ఓ ఇసుక ట్రాక్టర్ నీట మునిగింది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి అధికారులు సోమవారం ఉదయం నీటిని విడుదల చేశారు. అధికారులు ఈ విషయంపై గోదావరి తీర ప్రాంత ప్రజలకు సమాచారం అందించారు. కొందరు ఇసుక వ్యాపారులు కూలీలతో కలిసి ట్రాక్టర్ తీసుకొని గోదావరి నదిలోకి ఉదయం వెళ్లారు. ట్రాక్టర్‌లో ఇసుక నింపుతుండగానే ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగిం ది. కూలీలు, డ్రైవర్ ట్రాక్టర్‌ను అక్కడే వదిలేసి ఒడ్డుకు చేరుకున్నారు. గోదావరిలో మునిగిన ట్రాక్టర్‌కు గజ ఈతగాళ్లు తాడు కట్టి ఎక్స్‌కవేటర్ సహాయంతో ఒడ్డుకు తీసుకొచ్చారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సుల్తానాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సెయింట్ మేరీస్ స్కూల్‌కు చెందిన కాంపల్లి శ్రీలక్ష్మి ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో పోటీల్లో తన ప్రతిభను చాటుకుని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. లక్ష్మిని ఫాదర్ షౌరెడ్డి అభినందించారు. సిరిసిల్లలో మూడు రోజుల పాటు నిర్వహించే శిక్షణలో కూడా పాల్గొని త్వరలో మహబూబాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటుందని ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఇండియన్ పబ్లిక్‌స్కూల్‌కు చెందిన ఎస్ శ్వేత, డిప్రియదర్శిని కూడా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని స్కూల్ చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ క్రిష్ణప్రియ తెలిపారు. ఆదివారం నిర్వహించిన ఖోఖో ఉమ్మడి జిల్లాస్థాయి పోటీల్లో వీరిద్దరు ప్రతిభ చాటుకుని రాష్ట్ర పోటీలకు అర్హత సాధించారని తెలిపారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

దుబాయ్‌లో చేనేత కళాకారుడి వస్త్ర ప్రదర్శన


హరిప్రసాద్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు


హరిప్రసాద్ నేసిన వస్త్రాలు

సిరిసిల్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల చేనేత వస్త్ర పరిశ్రమలో అద్భుతాలు ఆవిష్కరిస్తున్న యెల్ది హరిప్రసాద్ మగ్గంపై నేసిన వివిధ వస్త్రాలను సోమవారం దుబాయ్‌లో దుబాయ్ ఎమిరేట్స్ పద్మశాలి అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శించారు. వస్త్రంపై మనుషుల బొమ్మలు, జీ 20 లోగో, అగ్గిపెట్టిలో అమిరే చీర వంటి వాటిని ప్రదర్శనలో ఉంచారు. సిరిపట్టు చీరలు, అంతరించిపోతున్న పీతాంభరం చీరతోపాటు నూలు పోగుల అల్లికలతో తయారు చేసిన చిత్రపటాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా నేత కళాకారుడు హరిప్రసాద్‌ను అసోసియేషన్ ప్రతినిధులు గుత్తికొండ రవిచంద్ర, సరస్వతి సన్మానించారు.

రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్‌లో
కరీంనగర్‌కు కాంస్య పతకం



ఐజీ అవినాష్ మొహంతి నుంచి కాంస్య పతకం అందుకుంటున్న సీఐడీ కానిస్టేబుల్ శ్రీనివాస్

కరీంనగర్ క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర పోలీస్ డ్యూటీ మీట్‌లో కరీంనగర్ పోలీస్ శాఖకు కాంస్య పతకం దక్కింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా రాష్ట్రంలో పోలీసు డ్యూటీ మీట్ ఏర్పాటు చేశారు. జిల్లాల వారీగా ఏర్పాటు చేసిన డ్యూటీ మీట్‌లో పతకాలు పొందిన పోలీసులకు రాష్ట్రస్థాయి హైదరాబాద్‌లో పోలీస్ డ్యూటీ మీట్ నిర్వహించారు. ఈ డ్యూటీ మీట్‌లో ఫొటోగ్రఫీ విభాగంలో కరీంనగర్ సీఐడీ కానిస్టేబుల్ కాసుల శ్రీనివాస్‌కు కాంస్య పతకం దక్కింది. దీనితో పాటు ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్‌కు శ్రీనివాస్ ఎంపికయ్యారు. వచ్చే నెలలో జార్ఖండ్ రాష్ట్రంలో నిర్వహించే ఆలిండి యా పోలీస్ డ్యూటీ మీట్‌లో శ్రీనివాస్ పాల్గొననున్నారు. శ్రీనివాస్‌కు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఐజీ అవినాష్ మొహంతి కాంస్య పతకం అందజేశారు.

సియోల్‌లో మంత్రుల బృందం

● వేస్టు టూ ఎనర్జీ ప్రాజెక్టు సందర్శన



సియోల్‌లో మంత్రుల బృందం

కరీంనగర్ అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చెత్తను రీసైకిల్ చేసి విద్యుత్‌గా మార్చే వేస్ట్ టు ఎనర్జీ(డబ్ల్యూటీఇ) కేంద్రాలను సందర్శించేందుకు రాష్ట్ర మంత్రుల బృందం సోమవారం దక్షిణ కొరియాలోని సియోల్‌కు చేరుకుంది. అక్కడ వేస్ట్ టు ఎనర్జీ ప్రాజెక్టును మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాష్ గౌడ్, కాలె యాదయ్య, మల్‌రెడ్డి రంగారెడ్డి, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి పరిశీలించారు.

సౌత్ జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 21: ఆంధ్రప్రదేశ్‌లోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఈనెల 17 నుంచి 19 వరకు నిర్వహించిన 35వ సౌత్ ఇండియా జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఎం వినయ్ 3 వేల మీటర్ల పరుగు పందెం లో సిల్వర్ మెడల్, జి నక్షత్ర అండర్-14 బాలికల ట్రైథ్లాన్ విభాగంలో సిల్వర్ మెడల్, విష్ణువర్ధన్ 10 వేల మీటర్ల నడక పోటీల్లో బ్రాంజ్‌మెడల్ సాధించా రు. ఈ సందర్భంగా విద్యార్థులను, కోచ్‌లు వరుణ్ కృష్ణన్, తిరుపతిలను జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాస్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవిలు అభినందించారు.




పతకాలు సాధించిన క్రీడాకారులు

- మల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యతో పాటు వివిధ అంశాల్లో శిక్షణ
- డిజిటల్, ఏఐ సాంకేతికతతో బోధన
- సాహస కృత్యాల్లో జాతీయస్థాయి గుర్తింపు
- చారిత్రక ప్రదేశాల పర్యటన

వైవిధ్యంగా బోధించడంతో పాటు.. విద్యార్థులు లక్ష్య సాధన దిశగా అడుగులు వేయడానికి ఆ పాఠశాల ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. తిమ్మాపూర్ మండలంలోని మల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిజిటల్ బోధనతో పాటు ఏఐ సాంకేతికతను జోడించి ప్రత్యేకంగా వివిధ అంశాలపై వీడియో పాఠాలు బోధిస్తున్నారు. తరగతి బోధనే కాకుండా విద్యార్థులను చారిత్రక ప్రదేశాలకు తీసుకువెళ్లి అక్కడి విశేషాలను తెలియజేస్తున్నారు. సాహస కృత్యాల్లో శిక్షణ ఇచ్చి వారిలో ఆత్మస్థయిర్యాన్ని నింపుతున్నారు.

వైవిధ్య బోధన.. లక్ష్య సాధన


ఏఐ సహాయంతో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

తిమ్మాపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : తరగతి గది బోధన మాత్రమే కాకుండా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నారు.. మల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు. డిజిటల్ బోధన, ఏఐ సాంకేతికత జోడించి వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. తరగతి గదుల్లోనే కాకుండా క్షేత్రస్థాయిలో విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తున్నారు. శారీరకంగా, మానసి కంగా ధృడంగా ఉండేలా విద్యార్థులకు సాసహకృత్యాల్లో తర్ఫీదు ఇస్తున్నారు. చారిత్రక ప్రదేశాల పర్యటనకు తీసుకువెళ్లి వారికి అవగాహన కల్పిస్తున్నారు. మల్లాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆరవ తరగతి నుంచి పదో తరగతి వరకు మొత్తం 50 మంది విద్యార్థులు ఉండగా, ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఉన్నారు.


రాష్ట్ర మాజీ గవర్నర్ తమిళిసై సౌందర్య రాజన్ చేతుల మీదుగా లీడర్ ట్రైనర్‌గా సర్టిఫికేట్ అందుకుంటున్న షరీఫ్ అహ్మద్


లాగ్ అండ్ టైర్ బ్రిడ్జిలో శిక్షణ పొందుతున్న విద్యార్థి

విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

తరగతి పాఠాలే కాకుండా వివిధ అంశాలపై విద్యార్థులకు బోధిస్తున్నారు. వారానికి ఒకటి, రెండు రోజులు మార్చ్ ఫాస్ట్, కథంతాల్, ఫుట్‌డ్రిల్, స్మార్ట్‌నెస్, గుడ్ ఆర్డర్ నేర్పిస్తున్నారు. పాఠశాలకు చెందిన 9మంది విద్యార్థులు జాతీయ యూత్ అడ్వెంచర్ కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభ చాటారు. 30 అడుగుల ఎత్తైన కొలంబో బ్రిడ్జ్ క్రాసింగ్, జిప్ లైనింగ్, రాక్ క్లైంబింగ్, ఆర్చరీ వంటి సాహసోపేత కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

విద్యార్థులకు వాస్తవ ప్రపంచం చూపించడమే లక్ష్యం

షరీఫ్ అహ్మద్, హిందీ ఉపాధ్యాయుడు



విద్యార్థులకు పాఠ్యాంశాలను కేవలం పుస్తకాల్లోనే కాకుండా వాస్తవ ప్రపంచం చూపించడం మా లక్ష్యం. నేను విధులు నిర్వర్తించిన ప్రతి పాఠశాలలో విద్యార్థులు తమ ప్రతిభను చాటి ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఇప్పటి వరకు మొత్తం 12 మంది విద్యార్థులు గవర్నర్ అవార్డులు, 32 మంది విద్యార్థులు ప్రధాన మంత్రి అవార్డులు, ఒక విద్యార్థి రాష్ట్రపతి అవార్డు తీసుకున్నారు. విద్యార్థులకు ప్రోత్సాహం అందించేందుకు తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు సహకరిస్తున్నారు.

అనుభవం మరింత ధైర్యాన్ని ఇచ్చింది

పి.రశ్మిత, 8వ తరగతి



పాఠశాలలో విద్యతో పాటు వివిధ రకాల శిక్షణ అనుభవం నాకు మరింత ధైర్యం అందించింది. టీమ్ గా కలిసి పనిచేసినప్పుడు నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. మేము కలిసి కష్టాలను ఎదుర్కొన్నప్పుడు అద్భుతమైన అనుభూతి, అనుభవం ద్వారా మిత్రుల మధ్య బంధం ఎంత ముఖ్యమో గుర్తించాను. ప్రతి కృషి విజయాన్ని అందించింది.

సాహస కృత్యాలు నాలోని భయాలను పోగొట్టింది

ఆర్.మహేష్, 9వ తరగతి,



మా పాఠశాలలో చదువుతో పాటు వివిధ అంశాల పై శిక్షణ ఇస్తుండటంతో ప్రతిరోజు పాఠశాలకు వెళ్లాలనిపిస్తుంది.

● **వీడియో పాఠాలు**

ప్రభుత్వం కొన్ని పాఠశాలల్లో డిజిటల్ బోధనకు ఏర్పాట్లు చేస్తుండగా మల్లాపూర్ పాఠశాలలో కూడా డిజిటల్ బోధన అందిస్తున్నారు. రికార్డెడ్ పాఠాలు బోధించడంతో పాటు ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్)ను ఉపయోగించి వివిధ అంశాలపై వీడియోలు రూపొందించి విద్యార్థులకు అందిస్తున్నారు. సుల భంగా పాఠాలు అర్థమయ్యేలా వీడియోలు రూపొందిస్తున్నారు. చదువుతో పాటు సమాజంలో ఎలా ఉండలానే దానిపై విద్యార్థులకు మానవీయ విలువలను తెలుపుతూ వీడియోలను తరగతి గదిలో ప్రదర్శిస్తున్నారు. తల్లిదండ్రులు, అంధులు, అంగవైకల్యం, మహిళలు, పసిపిల్లలు, వృద్ధాప్యంలో ఉన్నవారికి ఎలాంటి గౌరవం ఇవ్వాలనే దానిపై అవగాహన కల్పిస్తున్నారు.


మానవీయ విలువ పై విద్యార్థుల ప్రదర్శన


షూటింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థిని

సాహస కృత్యాలతో నాలోని భయం పోయింది. ఇప్పుడు నేను కొత్త కష్టాలను ఎదుర్కోవడానికి ధైర్యంగా ఉన్నాను. పాఠశాలలో మేము ఎంతో సంతోషంగా ఉన్నాం.



ఆర్చరీలో శిక్షణ పొందుతున్న విద్యార్థి

మా సర్ ప్రోత్సాహం ఎంతో ధైర్యాన్ని ఇచ్చింది

ఎం.భువన్ తేజ్, 7వ తరగతి



పాఠశాల అంటే భయం పోయింది. నాకు మా సర్ ఎంతో ప్రోత్సాహాన్ని అందించారు. నాకు ఈ అనుభవం చాలా ప్రత్యేకంగా ఉంది. నాకు స్నేహితులను సహాయం కోరడం ఎంత ముఖ్యమో చూపించింది. ఇలాంటి అనుభవం ద్వారా స్నేహితుల సహకారం, మద్దతు మన విజయానికి ఎంత కీలకమైనదో అర్థం చేసుకున్నాను.


మల్లాపూర్ పాఠశాల భవనము, పక్కన ఎత్తయిన గుట్ట

చారిత్రక అంశాలపై విద్యార్థులకు అవగాహన

విద్యార్థులకు ప్రేరణ ఇచ్చేందుకు వివిధ చారిత్రక ప్రదేశాలకు తీసుకువెళ్లి అక్కడ ఉన్న కట్టడాలను వారి చరిత్రను ప్రత్యేకతలను తెలుసుకునే విధంగా అవకాశం కల్పిస్తున్నారు. ఢిల్లీ, ఆగ్రాలోని ప్రధాన చారిత్రాత్మక ప్రదేశాలు ఎర్రకోట, లోటస్ టెం పుల్, కుతుబ్ మినార్, ఇండియా గేట్, రాష్ట్రపతి భవన్, అక్షర్‌ధామ్ టెంపుల్, తాజ్‌మహల్, ఆగ్రా కోటను సందర్శించా రు. హర్యానాలో పర్యటించిన విద్యార్థులు హర్యానాలోని మోడల్ పాఠశాలలను సందర్శించి, స్థానిక విద్యార్థులతో కలిసి కొత్త అనుభవాలు తెలుసుకున్నారు.


చారిత్రక ప్రదేశాల పర్యటనలో భాగంగా..

ఎస్‌యూను నంబర్‌వన్
యూనివర్సిటీగా తీర్చిదిద్దుతా

- న్యాక్ గుర్తింపు తీసుకురావడమే లక్ష్యం
- త్వరలోనే రెండు ఇంజనీరింగ్ కళాశాలల ఏర్పాటుకు కృషి
- నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్‌యూ వీసీ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్

గణేశ్‌నగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శాతవాహన యూనివర్శిటీని రాష్ట్రంలోనే నంబర్‌వన్ యూనివర్శిటీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని శాతవాహన యూనివర్శిటీ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ ఉమేశ్ కుమార్ తెలిపారు. వీసీగా నియామకమయ్యాక సోమవారం మొదటిసారిగా ఆయన శాతవాహన యూనివర్సిటీకి రాగా యూనివర్సిటీ రిజిస్ట్రార్ వరప్రసాద్ పుష్పగుచ్ఛం అందించి ఘనస్వాగతం పలికారు. వీసీ చాంబర్‌లో వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ కుటుంబ సభ్యులతో కలిసి బాధ్యతలు చేపట్టారు. అనంతరం మొదటి ఫైల్‌పై సంతకం చేశారు. బాధ్యత స్వీకరణ అనంతరం పలువురు యూనివర్సిటీ అధికారులు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

అనంతరం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాతవాహన యూనివర్శిటీకి న్యాక్ గుర్తింపు తీసుకురావడమే తన లక్ష్యమని తెలిపారు. యూనివర్సిటీలో రెండు ఇంజినీరిం గ్ కళాశాలల ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు, జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ సహకారంతో కృషి చేస్తానని పేర్కొన్నారు. యూనివర్శిటీ ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటు కావాల్సిన స్థలం మనకు అందుబాటులో ఉన్నదని తెలిపారు. యూనివర్శిటీలో కొత్త కోర్సులు, విద్యార్థులకు ఉపయోగపడే, జాబ్ ఓరియంటడ్, మల్టీ డిసిప్లేనర్ కోర్సుల ప్రవేశానికి ప్రత్యేకంగా దృష్టి పెడతామన్నారు. ఇందులో ఏ కోర్సు నుంచి ఏ కోర్సుకైనా వెళ్లాలా అవకాశం ఉంటుందన్నారు. తాను రిజిస్ట్రార్‌గా ఉన్న సమయంలో యూనివర్సిటీలో స్నాతకోత్సవం నిర్వహించామన్నారు. గవర్నర్, ఛాన్స్‌లర్ జిష్ణు దేవ్‌వర్మను ఆహ్వానించి రెండో స్నాతకోత్సవ నిర్వహణకు చర్యలు తీసుకుంటానని వీసీ తెలిపారు. యూనివర్శిటీ సమస్యలను పలువురు ఇప్పటికే తన దృష్టికి తీసుకువచ్చారని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. యూనివర్శిటీలో బీఈడీ, ఎం ఈడీ కళాశాలల ఏర్పాటు విషయం కూడా పరిశీలిస్తామన్నారు. కార్యక్ర మంలో రిజిస్ట్రార్ ఎం.వరప్రసాద్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ వై.కిషోర్, ప్రసాద్, పరీక్షల నియంత్రణాధికారి ఎస్వీ శ్రీరంగ ప్రసాద్, యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎండీ జాఫర్ జారీ, యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రిన్సిపాల్ హరికాంత్, యూనివర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ జయంతి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ ఉమేష్‌కుమార్


వీసీ ఉమేష్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్, అధ్యాపకులు



గంట స్తంభం.. గత వైభవ చిహ్నం

జగిత్యాల ప్రాశస్త్యాన్ని చాటుతున్న వైనం

జిల్లా వాసులను ఆకట్టుకుంటున్న నిర్మాణం

జగిత్యాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల గత వైభవానికి చిహ్నంగా క్లాక్ టవర్ నిలుస్తోంది. ఎన్నో ఆటుపోట్లు తట్టుకొని ప్రజలకు నేనున్నాంటూ పట్టణ నడిబొడ్డున ఠీవీగా నాలుగు ముఖాల క్లాక్ టవర్ నిలిచింది. క్లాక్ టవర్ పట్టణ అందాన్ని మరింత ఇనుమడింపజేస్తోంది. దీనిని చల్‌గల్‌కు చెందిన 1936 సంవత్సరంలో ధర్మా జలపతి రావు దేశ్‌ముఖ్ నిర్మించారని స్థానికులు అంటున్నారు.

ఇందులోని గడియారం జర్మని నుంచి ప్రత్యేకంగా తయారు చేయించి తీసుక వచ్చారని చెబుతున్నారు. ప్రజలు ప్రాణాంతకమైన కలరా వ్యాధి నుంచి కోలుకున్న సందర్భంగా దాని నిర్మూలనకు సాక్ష్యంగా దేశ్‌ముఖ్ ధర్మా జలపతి రావు నిర్మించారని కథనం ప్రచారంలో ఉంది. గంట గంటకు మోగే ఈ గడియారం చదువురాని సామాన్యులకు సైతం సమయం తెలిసిపోయేలా ఏర్పాటు చేశారు. అయితే చారిత్రకమైన టవర్‌లో గల క్లాక్ ప్రస్తుతం మరమ్మతుకు గురై పనిచేయడం లేదు. తొలినాళ్లలో కాషాయం, తెలుపు రంగు పైభాగంతో సుమారు 60 అడుగుల ఎత్తయిన అష్టభుజి గోపురం దీని ప్రత్యేకత అని అంటున్నారు. స్తంభానికి ఎత్తయిన భాగంలో నాలుగు వైపుల కనిపించేలా గడియారం ఏర్పాటు చేశారు. ఈ తదుపరి కాలంలో దీనికి పలు పర్యాయాలు రంగులు మారాయి. పైన నీలి రంగు, చుట్టూ తెలుపు, యాష్ రంగులతో ప్రస్తుతం టవర్ ఉంది. పలు పండుగలు, దినోత్సవాల సందర్భంగా రంగు రంగుల విద్యుత్ దీపాలతో ఈ చారిత్రక చిహ్నం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. జగిత్యాల పేరు చెబితే గుర్తుకు వచ్చే వాటిలో టవర్ కూడా ఒకటిగా గుర్తింపు పొందింది. పట్టణ నడిబొడ్డున గల టవర్ నాలుగు వైపుల ప్రధాన రహదారులు వాటికి ఇరువైపుల వ్యాపార, వాణిజ్య సముదాయాలున్నాయి. ప్రస్తుతం పనిచేయని గడియారం, సైరన్‌లను మరమ్మతు చేయాల్సిన అవసరముంది. పాలకులు పట్టించుకొని క్లాక్ టవర్ అభివృద్ధికి కృషి చేయా లని, టవర్ చరిత్రను, విశిష్టతను పర్యాటకులు తెలుసుకునే విధంగా ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఐటీఐల్లో ప్రవేశానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరీంనగర్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ కె.అశోక్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు విడుతల్లో భర్తీ చేయగా మిగిలిన సీట్లను వాక్ ఇన్ అడ్మిషన్స్ ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. పదవ తరగతి పాసైన అర్హులైన అభ్యర్థులు వెబ్‌సైట్ లో వెరిఫికేషన్ ఫీజు ఒక రూపాయి చెల్లించి ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. గతంలో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకోకుండా నేరుగా హాజరు కావాలని తెలిపారు. ఇప్పటికీ సీట్లు కేటాయించిన వారికి వాక్ ఇన్ అడ్మిష న్స్‌లో అవకాశం లేదన్నారు. మరిన్ని వివరాలకు 7799100360, 9989182747 నంబర్లలో సంప్రదించాలన్నారు.

న్యూస్ బాక్స్

ఉపాధిలేక యువకుడి ఆత్మహత్య

ఇల్లంతకుంట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపెల్లి గ్రామానికి చెందిన కండోజి వంశీ (19) అనే యువకుడు ఉపాధిలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. నిరుపేదైన వంశీ ఇంటర్ వరకు చదువుకున్నాడు. గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గ్రామంలో సరైన ఉపాధి లభించకపోవడంతో ఇటీవల విదేశాలకు వెళ్లాలని పాస్‌పోర్టు తీసుకున్నాడు. విదేశాలకు వెళ్లడానికి రూ.లక్ష ఖర్చు అవుతుండడంతో తెలిసిన వారందరిని అప్పు అడిగాడు. అందురూ నిరాకరించడంతో సోమవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. వంశీ తల్లి రేవతి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెట్లకు, పుట్టలకు రైతు బంధు

ముస్తాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చెట్లకు, పుట్టలకు, రోడ్లకు రైతు బంధు ఇచ్చిన ఘనత గత బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం విలేకరలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ నాయకులు అనవసర విమర్శలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, డైరెక్టర్ కుమార్, బీసీ సెల్ అధ్యక్షులు శీల ప్రశాంత్ పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభించాలి

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభించాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు. సోమవారం వేములవాడలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఆయన సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి వెంటనే పనుల ప్రకియను ప్రారంభించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. ఆలయ కమిటీ సభ్యులు జితేందర్, వెంకటేశ్, గిరిధర్‌రెడ్డి, అంజాగౌడ్, బాబు ఉన్నారు.

పెట్రోల్ బంక్ ప్రారంభం

తంగళ్లపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లిలో సిరిసిల్ల ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డీజిల్, పెట్రోల్ బంక్‌ను ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్‌గౌడ్ సోమవారం ప్రారంభించారు. ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకట రమణారెడ్డి, డైరెక్టర్లు గడిల సురేష్, శ్రీధర్‌రావు, మీరాల భాస్కర్ యాదవ్, దేవేందర్‌యాదవ్, వెంకట్ రెడ్డి, పర్శయ్య, గణ్య నాయక్ పాల్గొన్నారు.

ధాన్యంపై మిల్లర్ల అనాసక్తి

5వ పేజీ తరువాయి..



సిద్ధం గా ఉన్నా పాత గోనె సంచుల్లో క్రాప్రా పురుగు ఉండ డంతో ఎఫ్‌సీఐ బియ్యాన్ని తిరస్కరిస్తోంది. దీంతో కొత్త గోనె సంచులు ఇవ్వాలని రైస్‌మిల్లర్లు కోరుతున్నారు. జిల్లాకు వచ్చిన గోనె సంచులను గత అధికారులు నిబంధనలకు విరుద్ధంగా కొన్ని మిల్లులకే ఎక్కువగా ఇవ్వడం ద్వారా సమస్య తలెత్తినట్లు భావిస్తున్నారు. జిల్లాలో రైస్‌మిల్లర్ల నుంచి 2023-24 సంవత్సరానికి ఖరీఫ్ సీజన్ కు సంబంధించి 74 రైస్‌మిల్లులు, 29 బాయిల్డ్ రైస్ మిల్లులకు 2,00,715 టన్నుల ధాన్యం అందించారు. ఈ ధాన్యం నుంచి ప్రభుత్వ రంగ సంస్థలకు 1,35,023 టన్నుల బియ్యం ప్రభుత్వానికి రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,00,978 టన్నుల బియ్యం ఇచ్చారు. ఇంకా 34,045 టన్నుల బియ్యం మిల్లర్ల వద్ద ఉన్నాయి. రబీ సీజన్‌కు సంబంధించి 24 రైస్ మిల్లులు, 35 బాయిల్డ్ రైస్ మిల్లులకు 2,56,126 టన్నుల ధాన్యం అందజేశారు. దీని ద్వారా 1,74,165 టన్నుల బియ్యం ప్రభుత్వానికి అందించాల్సి ఉండగా 75,111 టన్నులు అందజేశారు. 99,757 టన్నుల బియ్యం మిల్లర్ల దగ్గర నుంచి రావాలి. కేంద్రప్రభుత్వ సంస్థ ఎఫ్‌సీఐకు బియ్యం అందించడానికి ఈ నెల 31 వరకు అవకాశం ఇచ్చారు. కానీ గోనె సంచుల్లో క్రాప్రా పురుగు ఉండడంతో ఎఫ్‌సీఐ తిరస్కరిస్తోంది. కొత్త సంచులు సమకూర్చుకోలేని పరిస్థితుల్లో రైస్‌మిల్లర్లు ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో దిగుబడి అంచనా

జిల్లాలో 248 కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం సేకరణకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో 1.80 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా 4.37 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో పౌరసరఫరాల శాఖ 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయనుంది. ఇందు కోసం ఇప్పటికే 70 కేంద్రాల వరకు ప్రారంభించారు. ధాన్యం దిగుబడిలో 34,230 మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు.

సమస్య పరిష్కారం తర్వాతే

- చేపూరి నాగరాజు, జిల్లా పారాబాయిల్డ్ రైస్‌మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు



ధాన్యం దించుకొని మళ్లీ బియ్యాన్ని అందించడంలో నష్టపోతున్నాం. రైస్ మిల్లర్ల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది. సమస్యలు పరిష్కరించిన తర్వాత ధాన్యం దించుకుంటాం.

గోనె సంచుల సమస్య

- పబ్బ నాగరాజు, జిల్లా రా రైస్‌మిల్ అసోసియేషన్ అధ్యక్షుడు



జిల్లాలోని రైస్ మిల్లర్ల ద్వారా ఎఫ్‌సీఐకు ధాన్యం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. గోనె సంచుల్లో క్రాప్రా పురుగు సమస్య ఉంది. ఎఫ్‌సీఐ బియ్యాన్ని తిరస్కరిస్తోంది. కొత్తవి ఇస్తేనే సీఎంఆర్ అందించడం సాధ్య మవుతుంది.

మిల్లింగ్ చార్జీలు ఇవ్వాలి

- బుస్స శ్రీనివాస్, కోశాధికారి రైస్‌మిల్లర్స్ అసోసియేషన్



ఖరీఫ్, రబీ సంబంధించి మిల్లింగ్, రవాణా చార్జీలు చెల్లించాలి. డ్రై ఏజ్, కస్టోడియేన్ చార్జీలు కూడా ఇవ్వాలి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మిల్లుల నుంచి గ్యారంటీ ఇవ్వలేం. పాత గోనె సంచుల ద్వారానే ఐకేపీ నుంచి ధాన్యం పంపుతున్నారు.

ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు

5వ పేజీ తరువాయి

వైద్య సేవలు అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయా?

డీఎంహెచ్‌వో : జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో మందుల కొరత లేదు. కుక్క కాటు, పాము కాటుకు, ఇతర అత్యవసర మందులు అందుబాటులో ఉన్నాయి. సెప్టెంబరులో 434 కుక్క కాటు కేసులు, ఈ నెల 20 రోజుల్లో 200 కేసులు వచ్చాయి. వారికి చికిత్సను అం దించాం. ప్రజలు ఆరోగ్య కేంద్రాలకు వచ్చి చికిత్స పొందవచ్చు.

ఆంధ్రజ్యోతి : దోమల నివారణకు తీసుకుంటున్న చర్యలేమిటి?

డీఎంహెచ్‌వో : జిల్లాలో సీజనల్ వ్యాధులు, మలేరియా, డెంగ్యూ, జ్వరాలకు కారణమైన దోమల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రతీ మంగళ, శుక్రవారం డ్రైడే నిర్వహిస్తున్నాం. నిల్వ నీటిని తొలగించడంతోపాటు దోమల నివారణకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : ప్రైవేటు ఆస్పత్రులపై నిఘా ఉందా?

డీఎంహెచ్‌వో : జిల్లాలో ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు పాటించకుంటే క్లీనికల్ ఎస్టాబిలిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటాం. లింగ నిర్ధారణ చేస్తే చర్యలు ఉంటాయి. జిల్లాలో ఇప్పటికే నాలుగు డయాగ్నోస్టిక్ కేంద్రాలకు షోకాజ్ నోటీసులు ఇచ్చాం.

ప్రజావాణికి విన్నపాల వెల్లువ

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు21 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి విన్నపాలు వెల్లువెత్తాయి. సమస్యలను చెప్పుకు నేందుకు జిల్లా నలుమూలల నుంచి ప్రజలు తరలివరావడంతో కలెక్టరేట్ కిటకిటలాడింది. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి కేంద్రంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాతోపాట అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ ప్రజావాణిలో 149 దరఖా స్తులు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన అర్జీలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి త్వరితగితన పరిష్కారం చూపాలన్నారు. అర్జీ దారులకు లిఖిత పూర్వకంగా సమాచారం ఇవ్వలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, డీఆర్‌డీవో శేషాద్రి, అధికారులు పాల్గొన్నారు.

- పట్టాతోపాటు ప్యాకేజీ అందించాలి

మిడ్ మానేరు డ్యాంలో ముంపునకు గురైన చింతల్‌ఠాణా గ్రామానికి చెందిన తనకు రాష్ట్ర ప్రభుత్వం అందించే ఇంటి పట్టాతోపాట నష్టపరిహారం ప్యాకేజీ రాలేదని చొక్కాల కర్ణాకర్ కలెక్టర్‌ను కోరాడు. సోమవారం కలెక్టర్‌కు వినతి పత్రాన్ని అందించాడు.

- కళాశాలల్లో వసతులు కల్పించండి

సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ కో- ఎడ్యూకేషన్ జూనియర్ కళాశాలల్లో మౌలిక వసతులను కల్పించాలని ప్రిన్సిపాల్ విజయ రఘునందర్ కోరారు. సోమవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాను కలిసి వినతి పత్రాన్ని అందించారు.

- హద్దులను నియమించాలి

ఎల్లారెడ్డిపేట మండలం పదిరలోని అటవీ భూమిలోని చెట్లను నరికివేసి అటవీ భూములను అక్రమించుకుంటున్నారని, జిల్లా కలెక్టర్ స్పందించి అడ్డుకొని హద్దులను నిర్ణయించాలని గ్రామస్థులు కలెక్టర్ సందీప్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఇప్పటి వరకు 300 ఎకరాల అటవీభూములను అక్రమించుకున్నారని దీనిపై అటవీశాఖ అధికారులు స్పందించాలని కోరారు. అక్రమణలను అడ్డుకోవడంతోపాటు హద్దులు ఏర్పాటుచేయాలని కోరారు. రాజిరెడ్డి కనుకయ్య, మల్లేశం, రాజిరెడ్డి, భీంరెడ్డి, లక్ష్మారెడ్డి, నర్సయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ చరిత్ర ప్రజలకు తెలుసు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వం చరిత్ర ప్రజలకు తెలుసని, అధికారం కోల్పోయిన పార్టీ నాయకులు రోడ్లు ఎక్కి గగ్గోలు పెడుతున్నారని కాంగ్రెస్ సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్ అన్నారు. సోమవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో టీపీసీసీ సభ్యుడు సంగీతం శ్రీనివాస్‌తో కలిసి మాట్లాడారు. మూడెకరల భూమి దళితులకు ఎక్కడ ఇచ్చారని, ప్రతీ నియోజకవర్గంలో 4వేల బెడ్‌రూం ఇళ్లు ఎక్కడ కట్టారని ప్రశ్నించారు. రైతుల కోసం రోడ్లు ఎక్కి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు బీఆర్‌ఎస్ నాయకులకు లేదన్నారు. సిరిసిల్ల మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వెలుముల స్వరూపతిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పట్టణ కార్యదర్శి మ్యాన ప్రసాద్, మహిళ కాంగ్రెస్ జిల్లా ప్రధానకార్యదర్శి కల్లూరి చందన, కౌన్సిలర్ కుడికాల రవికుమార్, పీసీసీ మాజీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, మాజీ కౌన్సిలర్ యెల్లె లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

హామీల అమలుపై చేతులెత్తేసిన ప్రభుత్వం

ఇల్లంతకుంట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం చేతులెత్తేసిందని బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. మండలకేంద్రంలో సోమవారం సభ్యత్వనమోదులో మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌పై ప్రజలకు విశ్వాసం పోయిందని, ఇప్పుడు బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. కాంగ్రెస్‌నున్నారు. ఆరు గ్యారంటీలు అమలు కాలేదన్నారు. మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్, నాయకులు నాగసముద్రాల సంతోష్, బత్తిని స్వామి, అమ్ముల అశోక్, భూమల్ల అనీల్, సాయగౌడ్, శ్రావణ్, ముత్తక్క, శ్రీనివాస్, మల్లేశం, మధుసూదన్‌రెడ్డి, సాగర్, ప్రశాంత్, రాజు పాల్గొన్నారు.

జీవో 29ని రద్దు చేయాలి

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : జీవో 29ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ఇన్‌చార్జి బానోత్ నరేష్‌నాయక్ అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణంలో విలేకురుల సమావేశంలో మాట్లాడారు. 90 శాతం జనాభా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు 50 శాతంకు రిజర్వేషన్లు పరిమితం చేశారని ఆరోపించారు. కేవలం 10 శాతం జనాభ ఉన్న అగ్రకులాలకు 50 శాతం కట్టబెట్టడం న్యాయం కాదన్నారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు శ్రీనివాస్‌నాయక్, ప్రకాష్‌నాయక్, తిరుపతి, గణేష్, గోవర్ధన్‌నాయక్ పాల్గొన్నారు.

తెలుగు సాహితీ జాతరలో ఉత్తమ ప్రదర్శన

ఇల్లంతకుంట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ తెలుగు సాహితీ జాతరలో మండలంలోని ముస్కానిపేటకు చెందిన తునికి తిరుపతి ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా తాడెపల్లిలో రెండు రోజుల క్రితం జరిగిన పోటీలలో తిరుపతి కవితాగానం, అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయంతో అలరించాడు. అమెజింగ్ వరల్డ్ బుక్ రికార్డ్స్, ఇంటర్ నేషనల్ మార్వెల్ ఆఫ్ బుక్ రికార్డుల్లో తిరుపతి పేరు నమోదైనట్లు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్, జాతీయ కన్వీనర్ రమాపతి, జాతీయ ప్రధాన కార్యదర్శి పార్థసారధి పేర్కొన్నారు. మండలకేంద్రంలోని వాణీనికేతన్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న తిరుపతికి ప్రిన్సిపాల్ తూముకుంట శ్రీనిధి, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం స్థలం కబ్జాకు యత్నం

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 21 (అంధ్రజ్యోతి) : ఇల్లంతకుంట మండలం రామోజీపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసే స్థలాన్ని గ్రామానికి చెందిన వ్యక్తి కబ్జా చేసేందుకు యత్నిస్తున్నాడని, తిరిగి కొనుగోలు కేంద్రానికి కేటాయించాలని రైతులు, నిర్వాహకులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. గ్రామంలోని సర్వే నంబరు 24లో ప్రభుత్వ ఉన్న భూమిలో పదేళ్లగా ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం గ్రామానికి చెందిన సావనపెల్లి నాంపెల్లి అనే వ్యక్తి ఆ స్థలాన్ని అక్రమించుకునేందుకు ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. రక్షించి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కేటాయించాలని రైతులు కోరారు.

ప్రసాదం విక్రయంపై విచారణ చేపట్టాలి

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 21 (అంధ్రజ్యోతి) : సిరిసిల్ల పట్టణంలోని లక్ష్మీవేంకటేశ్వర బ్రహోత్సవాల్లో భాగంగా రథోత్సవంలో అలయ అధికారులు అన్యమతస్తుడితో ప్రసాదాన్ని విక్రయించడంపై కలెక్టర్ స్పందించి విచారణ జరిపించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చేపూరి అశోక్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ అన్యమతస్తునితచే తయారు చేయించిన ప్రసాదాన్ని నివేదన చేయడం సరైందికాదన్నారు. కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టడంతోపాటు అలయ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. హిందూ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి మేర్గు సత్యనారాయణ, విశ్వహిందు పరిషత్ పట్టణ అధ్యక్షుడు పురుషోత్తం, భజరంగ్‌దళ్ నాయకులు పాల్గొన్నారు.

మాట తప్పిన కేటీఆర్



ధర్నా చేస్తున్న దళితులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : దళితులందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఇస్తామని కేటీఆర్ మాట తప్పారని, ఆ ఇళ్ల తమకే ఇవ్వాలని సోమవారం సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయం ఎదుట దళితులు ధర్నా చేపట్టారు. అంబేద్కర్‌నగర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు దళితులు, మహిళలు పట్టణ ప్రధాన రహదారులు గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవోకు దళిత సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తెర దేవదాస్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు మాట్లాడారు. దళితుల భూముల్లో డబుల్ బెడ్‌రూంలు కట్టిస్తామని అందులో నర్సింగ్ కళాశాల, అంబేద్కర్ భవనం నిర్మించుకోవడం కోసం భూమి ఇవ్వాలని అన్నారన్నారు.

కళ్లకు గంతలతో మాజీ సర్పంచుల రిలే దీక్షలు



దీక్ష చేస్తున్న తాజా మాజీ సర్పంచులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తాజా మాజీ సర్పంచులు కళ్లకు గంతలు కట్టుకొని వినూత్న నిరసన తెలిపారు. తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిరిసిల్ల అంబేద్కర్ చౌరస్తా వద్ద చేపట్టిన రిలే దీక్షలు సోమవారానికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు, ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ఖానపురం లక్ష్మణ్ మద్దతు తెలిపారు. తంగళ్లపల్లి, ముస్తాబాద్, ఇల్లంతకుంట మండలాలకు చెందిన మాజీ సర్పంచులు దీక్షలో కూర్చున్నారు. జేఏసీ కమిటీ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కరుణాకర్, ప్రధాన కార్యదర్శి దుమ్మ అంజయ్య, ఉపాధ్యక్షురాలు గణప శివజ్యోతి, కార్యదర్శులు పాల్గొన్నారు.

లడ్డూ ప్రసాదం తయారీలో అన్య మతస్తుల ప్రమేయం లేదు

- లక్ష్మీవేంకటేశ్వర దేవాలయం మాజీ చైర్మన్లు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భక్తుల కోసం చేయించిన లడ్డూ ప్రసాదం తయారీలో అన్య మతస్తుల ప్రమేయం లేదని ఆలయ మాజీ చైర్మన్లు అన్నారు. సోమవారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో దేవాలయం మాజీ చైర్మన్లు చేపూరి నాగరాజు, తీగల శేఖర్‌గౌడ్, ఉప్పల విఠల్‌రెడ్డి మాట్లాడారు. 30 సంవత్సరాలుగా బ్రహ్మోత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తున్నా మన్నారు. ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా లడ్డూ టెండర్ హిందువు పులి మల్లేశంకు అప్పగించామన్నారు. భక్తుల మనోభా వాలు దెబ్బతినకుండా ఉండడం కోసం దేవాలయం ఆవరణలోనే లడ్డుతో పాటు పులిహోరా ప్రసాదాలను తయరు చేయించా మన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 21 (అంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఫీజురీయింబర్స్‌మెంట్‌తోపాటు స్కాలర్‌షిప్ విడుదల చేయాలని బీఆర్‌ఎస్ విద్యార్థి విభాగం చేపట్టే విద్యావ్యతిరేకతల పోరాటంలో విద్యార్థులు భాగస్వాములు కావాలని రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ కోరారు. సిరిసిల్ల పట్టణంలోని సహస్ర జూనియర్ కళాశాలలో సోమవారం బీఆర్‌ఎస్ విద్యార్థి సమితి అధ్వర్యంలో రూపొందించిన స్టిక్కర్‌లను విద్యార్థులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యతిరేకతపై బీఆర్‌ఎస్ చేస్తున్న పోరాటంలో విద్యార్థులు భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మట్టి శ్రీనివాస్, కోడం వెంకటేశం, ముద్దం అనిల్‌గౌడ్, సాయి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

గంభీరావుపేట, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 23న సిరిసిల్లలో నిర్వహించ తలపెట్టిన మాదిగ, మాదిగ ఉపకులాల ఆత్మగౌరవ సభ 'చలో సిరిసిల్ల' పోస్టర్‌ను సోమవారం గంభీరావుపేట మండల కేంద్రంలో ఎంఆర్‌పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. నాయకులు ఎర్రోల్ల భీంరావు, శనిగరపు నరేష్, ఇరిగి సందీప్ తదితరులు ఉన్నారు.

వేములవాడ: ఈనెల 23వ తేదీన చేపట్టిన చలో సిరిసిల్ల కార్యక్రమం విజయవంతం చేయాలని ఎంఎస్పీ రాష్ట్ర నాయకులు అవునూరి ప్రభాకర్, గుండా థామస్, బొడ్డు రాములు కోరారు. చలో సిరిసిల్ల కార్యక్రమం కరపత్రాన్ని సోమవారం ఆవిష్కరించారు.

ఎల్లారెడ్డిపేట : ఈ నెల 23న నిర్వహించ తలపెట్టిన 'చలో సిరిసిల్ల' ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ కోరారు.

దళారీ వ్యవస్థకు స్వస్తి పలికిన కాంగ్రెస్



కొనుగోలు కేంద్రం ప్రారంభంలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

వేములవాడ టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దళారీ వ్యవస్థకు స్వస్తి పలికింది దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డితో కలిసి సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ఆలోచించే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ అన్నారు. రైతును రాజును చేయాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పమన్నారు. సింగిల్‌విండో చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ప్రతీ ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవిరాజు, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, సింగిల్‌విండో వైస్ చైర్మన్,డైరెక్టర్లు పాల్గొన్నారు.

బోయినపల్లి: రైతులు పండించిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బోయినపల్లి మండలంలో కొనుగోలు కేంద్రాలను ప్రాంభించారు.ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా మద్దతు ధర పొందాలన్నారు. మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి, సెస్ డైరెక్టర్ కొట్టేపల్లి సుధాకర్, సింగిల్ విండో చైర్మన్లు తీపిరెడ్డి కిషన్ రెడ్డి, వెంకటరామారావు, సెస్ డైరెక్టర్ సుధాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లేష్‌యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రమణారెడ్డి పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల అర్బన్ పెద్దూర్‌లోని పెద్దూర్ సింగ్‌విండో అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్నిసోమవారం సింగిల్ విండో చైర్మన్ జీల కిషన్‌యాదవ్‌తోకలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ వెల్ముల స్వరూపతిరుపతిరెడ్డి ప్రారంభించారు. కౌన్సిలర్లు చెన్నమనేని కీర్తికమలాకర్‌రావు, లింగంపల్లి సత్యనారాయణ, భూక్యరెడ్డినాయక్, మాజీ ఎఎంసీ వైస్ చైర్మన్ ఎరవెల్లి వెంకటరమణారావు, సింగిల్ విండో వైస్ చైర్మన్ నారాయణగౌడ్ పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్ళపల్లి మండలం జిల్లెల్లలోధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ వెలుముల స్వరూప తిరుపతిరెడ్డి ప్రారంభించారు. ప్యాక్స్ చైర్మన్ కోడూరి భాస్కర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఇట్టిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ మధు, రాజిరెడ్డి, రవీంద్రరావు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం బాకురుపల్లితండాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మపర్సన్ సబేరాబేగం ప్రారంభించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, సెర్ప్ ఏపీఎం మల్లేశం, ఏఎంసీ వైస్ చైర్మన్ రాంరెడ్డి, తాజా, మాజీ సర్పంచులు మంజుల, రవీందర్

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం రాజేశ్వర్‌రావునగర్, నాగంపేట, మల్లుపల్లె గ్రామాల్లో వరి దాన్యం కొనుగోలు కేంద్రాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయతిరుపతి ప్రారంభించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు పిట్ట వెంకటి, మాల్యాల రాజవీర్, నాయకులు ఉన్నారు.

ప్రజా అవసరాలకు అనుగుణంగా భూముల అభివృద్ధి



సమస్యను వివరిస్తున్న అధ్యాపకులు

వేములవాడ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజా అవసరాలు తీర్చేలా భూముల అభివృద్ధి చేస్తామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మర్రిపల్లిలో నూతన మార్కెట్ యార్డు నిర్మాణానికి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాతో స్థలపరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతుకు ఆమోద్యయోగ్యమైన అభివృద్ధిని చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. వేములవాడలో ఉన్న మార్కెట్ యార్డును మర్రిపల్లిలోని ప్రధాన రోడ్డుకు అనుకొని ఉన్న స్థలంలో మార్చేందుకు స్థల్నాన పరిశీలించినట్లు చెప్పారు. వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

రుద్రంగి: విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. రుద్రంగి మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. కళాశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేను సన్మానించారు. బాగా చదువుకొని కళాశాలకు రుద్రంగి గ్రామానికి మంచి గుర్తింపు తీసుకురావాలని విద్యార్థులకు సూచించారు. కాంగ్రెస్ గ్రామ కార్యదర్శి సామ మోహన్ రెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, డీసీసీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 21 (అంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, నిర్మాణాలకు అవసరమైన ఇసుకకు అనుమతులు ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సోమవారం ఏఐటీయూసీ తెలంగాణ బిల్డింగ్, కంట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ అధ్వర్యంలో కార్మికులు దర్నా చేశారు. కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ కార్మికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. ఏఐటీయూసీ భవన నిర్మాణకార్మిక సంఘం నాయకులు గాజుల పోశెట్టి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

సిరిసిల్ల కలెక్టరేట్, అక్టోబరు 21 (అంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతి పత్రం అందజేశారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతు న్నార న్నారు. ఇటీవల డీఎస్సీలో ఉద్యోగం సాధించిన ఉపాధ్యాయులు చేరిన కూడా చాలా పాఠశాలల్లో సరిపడ ఉపాధ్యాయులు లేనటువంటి పరిస్థితి నెలకొందన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జాలపల్లి మనోజ్ కుమార్, కుర్ర రాకేష్ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

వేములవాడ రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నమిలిగుండుపల్లిలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్ సోమవారం అందజశారు. మాజీ ఎంపీపీ వెంకటేశం పాల్గొన్నారు.

కోనరావుపేట: కోనరావుపేట మండల కేంద్రంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా ఆధ్వర్యంలో అందజేశారు. కాంగ్రెస్ నాయకులు చందనగిరి గోపాల్, గొట్టె రుక్మిణి, రమేష్ రెడ్డి, దేవరకొండ చారి, లింబయ్య తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మిక సుతారి సంఘం

వీర్నపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండల భవన నిర్మాణ కార్మిక సుతారి సంఘం కార్యవర్గాన్ని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగుమంటి ఎల్లారెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా నాయకుడు అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా భూక్య వెంకటి, ఉపాధ్యక్షుడిగా ఈసంపల్లి రాజేల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా ఆత్మకూరి శంకర్, కోశాధికారిగా మల్లారపు చంద్రయ్య, కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు.